టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా కాయలు రూ.20తో అమ్ముడుపోయాయి. మార్కెట్‌కు బుధవారం 1500 టన్నులు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

రేపు ఇంటి వద్దకే పింఛన్

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును నవంబరు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లవద్దనే అందిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2,85,004 మంది లబ్ధిదారులకు రూ.124 కోట్లు విడుదలైందని తెలిపారు. ఒకటో తేదీన ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ఒకటో తేదీన పింఛన్ తీసుకోనివారికి రెండో తేదీ ఇస్తామని తెలిపారు.

సంబరాలు.. ఢాం.. ఢాం 6





























హంద్రీనీవాకు నిధులు కేటాయించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరువు జిల్లాకు నీరు అందించే హంద్రీనీవా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాలవ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.2 వేల కోట్లు, వెలిగొండకు రూ. 2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రయోజనం


మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

కలిగించే పోలవరం ఎత్తు కుదించేందుకు, ప్యాకేజీ డబ్బులు ఎగ్గొట్టేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. పోలవరంతో తాగు, సాగునీటితో పాటు 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు సైతం కేంద్రం ఇదేవిధంగా దోబూచులాడిందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో లాలూచీ పడితే... నూకలు చెల్లినట్టే అన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ విషయంలో ఏపీ రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలసి రావాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, అనంతపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య, నాయకులు నారాయణస్వామి, శ్రీరాములు, అల్లిపీరా, రమణ పాల్గొన్నారు.

గుత్తికోటను అభివృద్ధి చేయండి: గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. బుధవారం ఆయన నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిన లేఖను విడుదల చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ...1500 ఏళ్ల కిందట బాదామి చాళుక్యులు నిర్మించిన గుత్తి కోటను విజయనగర రాజు లు మరింత పటిష్టం చేశారని గుర్తుచేశారు. జిల్లాలో ఎక్కడా ఇలాంటి కోట లేదన్నారు. ఇతర జిల్లాల నుంచి ఈ కోటను చూసేందుకు పర్యాటకులు వస్తుంటారని పేర్కొన్నారు.

2లోపు అభ్యంతరాలు తెలపండి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబరు 2వతేదీలోపు రాతపూర్వకంగా తెలియజేయాలని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయకట్టు వివరాలను ఫారం-ఏ రూపంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలలో జలవనరుల శాఖ అధికారులు ప్రదర్శనలో ఉంచారని తెలిపారు. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ఆయకట్టు తుది వివరాలు ఫారం-ఏఏలో నవంబరు 3న ప్రదర్శిస్తామని వివరించారు. బీటీపీ కింద ఆరు సంఘాలు, 89 చెరువులు మొత్తం 95 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎంఎస్ రాజు

● మడకశిర ఎమ్మెల్యేకు అవకాశం
● నియోజకవర్గానికి రెండోసారి..



మడకశిర/టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కింది. ఈ మేరకు బుధవారం టీటీడీ బోర్డు కార్యవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. చైర్మన్‌తోపాటు 23 మందికి సభ్యులుగా అవకాశం కల్పించారు. అందులో ఎమ్మెల్యే ఎంఎస్ రాజును బోర్డు సభ్యుడిగా ఎంపిక చేశారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈయన టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో చివరి నిమిషంలో మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం దక్కించుకున్నారు. విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తాజాగా టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎంఎస్ రాజును ఎంపిక చేయడం గమనార్హం.

మడకశిరకు టీటీడీ భాగ్యం

మడకశిర నియోజకవర్గానికి టీటీడీ భాగ్యం దక్కుతోంది. గత వైసీపీ పాలనలో నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన తిప్పేస్వామి సైతం టీటీడీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. తాజాగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజును సైతం బోర్డు సభ్యుడిగా ఎంపిక చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పీఆర్‌లో ముగ్గురు ఉద్యోగుల బదిలీ

అనంతపురం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ డెప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పీఐయూ డీఈఈగా పనిచేస్తున్న రాజన్నను కళ్యాణదుర్గం పీఆర్ఐ ఇన్‌చార్జి డీఈఈగా బదిలీ చేశారు. ఉరవకొండ పీఐయూలో జేఈగా పనిచేస్తున్న తిరుపాల్‌ను మడకశిర పీఐయూ ఇన్‌చార్జి డీఈఈగా బదిలీ చేశారు. వీరితో పాటు తాడిపత్రి పీఆర్ఐ సబ్ డివిజన్‌లో యాడికి జేఈగా పనిచేస్తున్న యల్లంనాయుడుని అదే సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఈఈగా బదిలీ చేశారు. దీంతో వీరందరూ బుధవారం సాయంత్రం ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు.

కార్తీకమాసంలో ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ప్రతి సోమవారం బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. ఉదయం 5 గంటలకు పుట్టపర్తి, ధర్మవరం,హిందూపురం, కదిరి, మడకశిర నుంచి బస్సులు బయల్దేరతాయన్నారు. బుగ్గ రామలింగేశ్వరాలయం, యాగంటి, మహానంది దర్శనం అనంతరం తిరిగి రాత్రికి ఆయాప్రాంతాల్లో భక్తులను వదిలేస్తామన్నారు.

సైబర్ క్రైంపై అవగాహన కల్పించండి

● వధాన్య సొసైటీ ఫౌండర్‌కు ఎస్పీ సూచన
● ప్రతిభ పరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రత్న, వధాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ పొడపాటి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్‌క్రైం, డిజిటల్ అరెస్టు మోసాలపై అవగాహన కార్యాక్రమాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ రత్న.. వధాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ పొడపాటి, మిత్రబృందానికి సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభాపరీక్షకు సంబంధించిన పోస్టర్లను ఎస్పీ రత్న, వధాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ పొడపాటి ఆవిష్కరించారు. అశోక్ పొడపాటి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో డిసెంబరు 22న కొత్తచెరువులో ప్రతిభాపరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 29న డీఎస్సీ ఎస్జీటీ మెగా గ్రాండ్‌టెస్టును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు పోలీసుశాఖ సహకారం అందించాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్‌క్రైం, డిజిటల్ అరెస్టు మోసాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలనీ, ఇందుకు పోలీసుశాఖ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వధాన్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన నవీన్‌తో అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థి నవీన్ ఎంపికయ్యాడు. నవంబరు 1 నుంచి బెంగుళూరులో నిర్వహించే సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్వీ డిగ్రీ-పీజీ కళాశాల క్రీడాకారుడు నవీన్ ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన ఎస్కేయూ అంతర్‌కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. నవీన్‌ను బుధవారం కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, పీడీ శ్రీనివాస్‌నాయక్, అధ్యాపకులు అభినందించారు.

అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో పంటలన్నీ పూర్తిగా కోల్పోయిన నేపథ్యంలో అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు ఏడింటిని మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడంపై ప్రజా ప్రతినిధులు స్పందించి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సవరించేలా చూడాలని కోరారు. రైతులకు నష్టపరిహారం, కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పనిదినాలు కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాక జిల్లాలోని మూడు లక్షల ఎకరాలను బీడుగా ఉంచారని తెలిపారు. వేరుశనగ, పత్తి, కంది, ఆముదం తదితర పంటలు జూలై, సెప్టెంబర్‌లో వర్షాలు రాకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నా రు. అత్యధిక మండలాల్లో కరువే లేదని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఈ వాస్తవాలను గ్రహించకుండా కరువు మండలాల ప్రకటన చేయడం రైతులు, కూలీలకు తీవ్రనష్టం కలిగించడమే అవుతుందన్నారు. పంటనష్ట పరిహారం అంచనా వేసి, పరిహారం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కరువు మండలాల్లో అన్యాయం : సీపీఐ


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలోని ఏడింటిని మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమని, మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి ఖరీఫ్ పంటలు సాగుచేశారని తెలిపారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో మొత్తం పంటలు నష్టపోయారన్నారు. జిల్లా అంతటినీ కరువుగా ప్రకటించాలని, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధికారులు వాస్తవాలు గ్రహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు మల్లికార్జున, నారాయణస్వామి, రాజారెడ్డి, లింగమయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

నిజాయతీతోనే ఉన్నత వ్యక్తిత్వం

● రైల్వే చీఫ్ విజిలెన్స్ అధికారి విజయన్


మాట్లాడుతున్న విజయన్

గుంతకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నిజాయతీతో విధినిర్వహణ చేసేవారు ఆత్మసంతృప్తి, ఉన్నత వ్యక్తిత్వంతో కెరీర్‌ను విజయవంతంగా పూర్తిచేస్తారని దక్షిణ మధ్య రైల్వే స్పెషల్ డిప్యూటీ మేనేజరు, రైల్వే చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు విజయన్ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక రైల్వే క్లబ్‌లో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా రైల్వే ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయన్, డీఆర్ఎం విజయ కుమార్ మాట్లాడు తూ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఉద్యోగులకు వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఏడీఆర్ఎం సుధాకర్, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు జిల్లా యువకుడు


అరోన్ రొనాడివో

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లుటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు జిల్లా యువకుడు ఎంపికయ్యాడు. నవంబరు 1 నుంచి 7వతేదీ వరకు చైనాలో నిర్వహించే 4వ ప్రపంచ జూనియర్ సాఫ్టటెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు గుంతకల్లు పట్టణానికి చెందిన ఆరోన్ రొనాడివో ఎంపికైనట్లు సాఫ్టటెన్నిస్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆరోన్ రొనాడివో భారత జట్టుతో కలిసి ఈనెల 31న ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చైనా బయలుదేరి వెళ్లనున్నాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆరోన్ రొనాడివోకు ఏపీ సాఫ్టటెన్నిస్ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్, కార్యదర్శి మేరీ జ్యోతి అభినందనలు తెలిపారు.

జీడిపల్లికి 1234 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1234 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలా గే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,094 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన 36వ జాతీయ స్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు. ఇందులో మహీధర్ బంగారు పతకం సాధించాడు. స్పందన, దీక్షిత, జ్యోతిక రజత పతకాలు సాధించారు. విజేతలను బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రజాక్, కార్యదర్శి రంగస్వామి, పీడీ అమరాంజనేయులు పాల్గొన్నారు.

ఇలా ఎందుకు చేశావమ్మా..!

● తల్లి మృతదేహం వద్ద విలపించిన చిన్నారులు
● విషాదం నింపిన వివాహిత ఆత్మహత్య

'మగ్గం నేస్తూ మమ్మల్ని బాగా పెంచావు కదమ్మా.. ఇప్పుడెందుకు ఇలా చేశావు..? బాగా చదువుకోవాలని ఎప్పుడూ చెబుతుండేదానివి కదమ్మా.. ఇప్పుడు మమ్మల్ని ఎవరు చూసుకుంటారు..' అంటూ తల్లి మృతదేహం వద్ద చిన్నారుల విలపించిన తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది.


వెంకటేశ్వరి (ఫైల్)

యాడికి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికురాలు వెంకటేశ్వరి ఆత్మహత్య చేసుకోవడంతో.. ఆమె కొడుకు, కూతురు విలపించిన తీరు అక్కడ ఉన్న వారి హృదయాలను కదిలించివేసింది. కుటుంబ సమస్యలతో చేనేత కార్మికురాలు వెంకటేశ్వరి (36) అనే


తల్లి మృతితో దీనస్థితిలో ఉన్న కుమార్తె, కుమారుడు

వివాహిత యాడికిలో బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికిలోని కమలపాడురోడ్డు సమీపాన కాలనీలో నివాసం ఉంటున్న మహానందరెడ్డి, వెంకటేశ్వరి దంపతులు చేనేత వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె నిఖితరెడ్డి, కుమారుడు చైతన్యరెడ్డి ఉన్నారు. నిఖిత అనంతపురంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చైతన్యరెడ్డి యాడికి ఆదర్శపాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ కలహాలతో మహానందరెడ్డి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. వెంకటేశ్వరి కుమారుడిని బుధవారం పాఠశాలకు పంపింది. జ్వరంతో బాధపడుతూ ఇంటివద్ద ఉన్న కుమార్తెని మాత్రలు వేసుకొని పడుకోమని చెప్పింది. కుమార్తె నిద్రలోకి జారుకున్నాక ఆమె వంటగదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నిద్రలేచిన నిఖిత తల్లిని పిలవగా ఎంతసేపటికి పలకలేదు. ఇంటిలోపల ఫ్యాన్‌కు ఉరివేసుకున్న తల్లిని చూసి విలవిలలాడిపోయింది. సమీపంలోని వారివద్దకు వెళ్లి విషయం తెలపడంతో మృతదేహాన్ని కిందకు దింపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక వైపు తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోగా.. తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ చిన్నారుల రోదన వర్ణనాతీతంగా మారింది.

అమ్మ ఆత్మహత్య

● ఇదివరకే తండ్రి మృతి ● అనాథలైన ఇద్దరు కుమారులు


నూర్జహాన్ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డి కాలనీ ఎల్-3లో ఉంటున్న నూర్జహాన్ (37) క డుపునొప్పి భరించలేక బుధవారం ఆత్మహ త్య చేసుకుంది. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నా యి. నూర్జహాన్ భర్త ఖాదర్‌బాషా మూ డేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నూర్జహాన్ రేషం పనిచేసుకుంటూ ఇద్దరు కుమారులు షెక్షావలి, షాషావలిని పోషించుకుంటుండేది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. బుధవారం సా యంత్రం కడుపునొప్పి తీవ్రం కావడం తో మనస్తాపం చెందిన నూర్జహాన్ ఇంట్లో ఉ రేసుకుని, మరణించింది. స్థానికుల స మాచారం మేరకు టూటౌన్ సీఐ రెడ్డప్ప ఘటనా స్థ లానికి చేరుకుని, పరిశీలించారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకుని, ద ర్యాప్తు చేపట్టారు. నూర్జహాన్ మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనాథలైన కుమారులు

ఇదివరకే ఖాదర్‌బాషా మరణించడం, ఇప్పుడు నూర్జహాన్ ఆత్మహత్య చేసుకోవడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పెద్ద కుమారుడు షెక్షావలికి 15 ఏళ్లు కాగా.. చిన్న కుమారుడు షాషావలికి 11 ఏళ్లు. షాషావలి ఆరో తరగతి చదువుతున్నాడు. వారి పరిస్థితిని చూసి, అక్కడున్న వారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు.

కలిసికట్టుగా జీవించాలి: కలెక్టర్, ఎస్పీ సూచన

బుక్కరాయసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అందరూ కలిసిక ట్టుగా జీవించాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సూచించారు. కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించ వచ్చని అన్నారు. మండల పరిధిలోని కేకే అగ్రహారం గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్, ఎస్పీ హాజరయ్యారు. తొలుత ఎస్సీకాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. గ్రామంలో సమస్యలపై వెంటనే నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని సమస్యలున్న ప్రాంతాల్లో ప్రతి నెలా 30న పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఇది ఉప యోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బీఆర్ దాస్ , ఐసీడీఎస్, పీడీ శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, తహసీల్దార్ పుణ్యవతి, సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

రికార్డులు మాయం..!

డీఎల్‌డీఓ రాకతో వెలుగులోకి..

యాడికి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 2019 నుంచి 2023 వరకు రికార్డులు, ఎం.బుక్కులు, ఓచర్లు మాయమయ్యాయి. మండల పరిషత్ నిధుల వినియోగాన్ని పరిశీలించేందుకు డీఎల్‌డీఓ విజయలక్ష్మి మంగళవారం యాడిక్కి రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మాయమైన వాటిని 24 గంటల వ్యవధిలో తనకు అందజేయాలని డీఎల్‌డీఓ ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, పీఆర్ ఇంజనీర్లు అనంతపురంలోని ఆడిట్ కార్యాలయానికి బుధవారం వెళ్లినట్లు సమాచారం. అక్కడ కూడా రికార్డులు లేవని చెప్పినట్లు తెలిసింది. 2019లో రెగ్యులర్ ఎంపీడీఓగా కొండయ్య వచ్చారు. అయినా, అంతకు మునుపు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరించిన ఈఓఆర్డీ అనిల్‌కుమార్ పెత్తనం కొనసాగింది. సీఎఫ్ఎంఎస్ లాగిన్ ఆయన వద్దే ఉండిపోయింది. అందులో అప్‌లోడ్ చేసిన ఫైల్స్‌లో రెగ్యులర్ ఎంపీడీఓ సంతకాలు లేకుండా అనిల్ కుమార్ సంతకాలు చేయడం అనుమానాలకు తావిస్తోంది. రెగ్యులర్ ఎంపీడీఓ వచ్చిన తరువాత ఏడాదిన్నరపాటు ఈ తంతు కొనసాగింది. ఆ సమయంలో నిధుల వినియోగంపై అనుమానాలు ఉన్నాయి. డీఎల్‌డీఓ మంగళవారం వచ్చినా.. ఆ అధికారి హాజరు కాకపోవడం గమనార్హం.

అన్నీ అనుమానాలే..

అవినీతిని కప్పిపెట్టేందుకే రికార్డులు మాయం చేశారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆడిట్ సమయంలో రికార్డులను ఆ శాఖ అధికారులకు అప్పగించామని ఎంపీడీఓ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. కానీ అక్కడికి వెళ్లిన అధికారులకు చుక్కెదురైనట్లు తెలిసింది. 'మీరు రికార్డులు ఇచ్చినట్లు రసీదు ఏమైనా ఉంటే చూపించండి' అని ఆడిట్ అధికారి అడిగారని, రసీదు ఇవ్వలేదని యాడికి అధికారులు అన్నారని తెలిసింది. ఈ విషయాన్ని జడ్పీ సీఈఓ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. రికార్డులు కనిపించకుండా పోయాయా? కనిపించకుండా చేశారా..? అన్న చర్చ జరుగుతోంది. రెగ్యులర్ ఎంపీడీఓ వచ్చాక ఇన్‌చార్జి ఎంపీడీఓ సీఎఫ్ఎంఎస్‌లో ఎందుకు లాగిన్ అయ్యారనే సందేహం కలుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకుంటారా..? అక్రమాలను నిగ్గు తేలుస్తారా..? తేలాల్సి ఉంది.

ఎస్పీ నేర సమీక్ష

అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీపీఓలో ఎస్పీ జగదీష్ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. అన్ని రకాల నేరాలపై నమోదైన కేసులు, దర్యాప్తులో పురోగతి గురించి తెలుసుకున్నారు. శాంతిభద్రతలను కాపాడాలని ఆదేశించారు. హెడ్ క్వార్టర్స్ నుంచే ఇచ్చే ఆదేశాలు పాటించాలని అన్నారు. ప్రజలతో మమేకమై.. వారితో స్నేహంగా మెలగాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు పాల్గొన్నారు.

ఫటాఫట్

అదనపు నీటితోనే అనంత అభివృద్ధి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అదనపు నీటితోనే ఉమ్మడి అనంత అభివృద్ధి సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ అన్నారు. వైఎస్ జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదం వారి కుటుంబ సమస్య అని, దీనిపై రాజకీయ జోక్యం అవసరం లేదని అభిప్రాయపడ్డారు. వర్తమాన పరిణామాలపై ఆంధ్రజ్యోతి ప్రశ్నలకు పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన సమాధానాలిచ్చారు.

ఆంధ్రజ్యోతి: కూటమి ప్రభుత్వం హామీల అమలు ఎలా ఉంది..?

రామకృష్ణ: ఏ హామీలైనా అమలు చేయాలంటే ఆర్థిక వనరులు అవసరం. కేంద్రం నుంచి కొంత సహకారం పెరగవచ్చు. ఈ ప్రభుత్వానికి కొంత టైం ఇవ్వాలి. వాళ్లు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: లోకేశ్ అమెరికా పర్యటనతో జిల్లా వైపు కొత్త కంపెనీల చూపు పడిందని అంటున్నారు...

రామకృష్ణ: కియ వచ్చిన తర్వాత జిల్లాలో చాలా అభివృద్ధి కనిపిస్తోంది. కొత్త పరిశ్రమలు వస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది. అదనపు నీటితోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యం. శ్రీశైలం, తుంగభద్ర నుంచి మరిన్ని నీళ్లు తెచ్చుకోవాలి. ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: వైసీపీ పాలనతో భూ దందాలపై మీ పోరాటం ఎంత దూరం వచ్చింది..?

రామకృష్ణ: ఇటీవలే విజయవాడలో భారీ సదస్సు పెట్టాం. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి వచ్చిన నాయకులు భూ అక్రమాల గురించి రెవెన్యూ మంత్రి అనగాని ప్రసాద్‌కు వివరించారు. మంత్రి వెంటనే 20 జిల్లాల కలెక్టర్లకు నివేదిక పంపారు. విచారణ జరుగుతోంది. వచ్చే నెల మొదటి వారంలో మళ్లీ రెవెన్యూశాఖ మంత్రిని కలుస్తాం. భవిష్యత్తు కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తాం.

ఆంధ్రజ్యోతి: షర్మిల - జగన్ వివాదాన్ని ఎలా చూస్తారు..?

రామకృష్ణ: అది వారి వ్యక్తిగత, కుటుంబ ఆస్తుల సమస్య. వాళ్లే పరిష్కరించుకోవాలి. లేకుంటే కోర్టులు చూసుకుంటాయి. దీనిపై రాజకీయం తగదు. నాయకులు కామెంట్స్ చేయడం, మీడియాలో చర్చలు జరగడం సమంజసం అని నేను అనుకోవడంలేదు.

\- అనంతపురం విద్య, ఆంధ్రజ్యోతి

ఎస్సీ ఎస్టీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ కులాల జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు ఇస్తున్నాయని అన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం నిధులలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు కేటాయిస్తున్నామని అన్నారు. ఈ నిధులు వారి అభివృద్ధి, సంక్షేమం కోసం వందశాతం వినియోగించాలని ఆదేశించారు. మెప్మా పరిధిలో బ్యాంకు లింకేజీ ద్వారా లబ్ధి చేకూర్చాలని, పీఎం స్వానిధి రుణాలను లక్ష్యం మేరకు ఇవ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలలో బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లేలా చూడాలని అన్నారు. ఉద్యోగ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, సీపీఓ అశోక్ కుమార్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ఖుష్బూకొఠారి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సదస్సులో గేట్స్ విద్యార్థుల ప్రతిభ

గుత్తి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అనంతపురంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి సాంకేతిక సదస్సులో ప్రతిభ చాటినట్లు కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ బుధవారం తెలిపారు. అనంతపురంలో జేఎన్‌టీయూ యూనివర్శిటీలో పిక్సెల్2కే 24, డైనమెక్స్ 2కే 24 అనే రెండు జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులు జరిగాయన్నారు. ఇందులో దేశ వ్యాప్తంగా 30 కళాశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. గేట్స్ కళాశాలకు చెందిన వెంకటసాయి, రేవంత్, తిలక్, మణి పాల్గొని ప్రతిభ చూపి మొదటి బహుమతి సాధించినట్లు చెప్పారు. అశోక్, యుగంధర్ రెండో బహుమతి, మహ్మద్ అబ్దుల్‌హక్, అల్లావలి మూడో బహుమతి సాధించారని తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న డాక్టర్

అనంతపురం అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఈఎన్‌టీ వైద్యుడు జ్వాలాపురం శ్రీనాథ్ తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఆయన బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పార్టీకి రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.



పద.. ఇంక కాల్చేద్దాం..



అరటి పిలకలు కొంటున్న మహిళ



టపాసుల విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల సందడి

సంబరాలు.. ధాం.. ధాం..!



నేడు వెలుగుల వేడుక.. దీపావళి

అమావాస్య చీకట్లను పారదోలేన్ని దీపాలను వెలిగించే పండుగ.. దీపావళి. చెడుపై మంచి గెలుపునకు సూచికగా నిర్వహించుకునే వేడుక. అజ్ఞానపు చీకట్లను తొలగించి.. జ్ఞానమనే వెలుగులను పంచే పర్వదినం. జిల్లా ప్రజలు నరక చతుర్దశిని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దీపావళి సంబరాలు గురువారం అంబరాన్ని తాకనున్నాయి. ఇందుకు అవసరమైన పూజా సామగ్రి, పూలు, పండ్లు, మిఠాయిలు, మట్టి ప్రమిదలు, బాణసంచాను ప్రజలు భారీగా కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు. బాణసంచాను ఎప్పుడెప్పుడు కాలుద్దామా అని చిన్నారులు ఉబలాటపడుతున్నారు. తెచ్చిన నిల్వలలో కొన్నింటిని ఇప్పటికే పేల్చేశారు. ఈ పర్వదినాన జగములనేలు తల్లి మహాలక్ష్మి భూలోక విహారానికి వస్తారని, ఆ సమయంలో మహాలక్ష్మిని కొలిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఇళ్లు, దుకాణాలు, పని ప్రదేశాలను ప్రత్యేకంగా అలంకరించి.. లక్ష్మీపూజకు సిద్ధమయ్యారు.

\- అనంతపురం కల్చరల్, ఆంధ్రజ్యోతి



ఫైరింజన్, అగ్నిమాపక సిబ్బంది సిద్ధం..



మహాలక్ష్మి పూజకు.. పూలు



వెలుగుల కోసం.. మట్టి ప్రమిదలు

ముందే దీపావళి..!

డాక్టరైన మాడీ ఇంటి అంజినయ్య మనవడు

కష్టాలను జయిస్తున్న ఒకనాటి భూస్వామ్య కుటుంబం

విడపనకల్లుకు చెందిన మౌనిష్.. డాక్టరయ్యాడు. బళ్లారి జిల్లా కుడితిని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం విధుల్లో చేరాడు. 'ఇందులో విశేషం ఏముంది..? చాలా మంది డాక్టర్లు అవుతున్నారు. రోగులకు సేవలు అందిస్తున్నారు..' అనుకుంటున్నారా..? విశేషం ఉంది. రెండు తరాల క్రితం వీరిది భూస్వామ్య కుటుంబం. మౌనిష్ తాత బండి అంజినయ్య విడపనకల్లులోఓ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని దానం చేశారు. దీని విలువ ప్రస్తుతం రూ.5 కోట్లకు పైగా ఉంటుంది. అంజినయ్యకు ఇద్దరు కుమారులు.. పాపారాయుడు, క్రిష్ణమూర్తి. వీరిని 'మాడీ ఇంటి అంజినయ్య' కుటుంబం అని పిలుస్తుంటారు. వ్యవసాయ సంక్షోభం వీరిని వెంటాడింది. పంటలు సరిగా పండక అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చేందుకు ఆస్తులను ఒక్కొక్కటిగా అమ్మేశారు. ఈ క్రమంలో మాడీ ఇల్లు, 20 ఎకరాల చీనీ తోట కరిగిపోయాయి.

సోదరులు ఇద్దరూ ఊరు విడిచి.. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు వలస వెళ్లారు. అక్కడ పొలాలను కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేస్తూ కాలం గడిపారు. కొన్నాళ్ల తరువాత విడపనకల్లుకు తిరిగి వచ్చేశారు. శివారు ప్రాంతంలో భోజనం హోటల్‌ను ప్రాంభించారు. అన్నదమ్ములిద్దరికీ ఇద్దరిద్దరు కొడుకులు. కష్టపడి చదివిస్తున్నారు. పాపారాయుడు, పుష్పావతి దంపతుల కుమారుడే మౌనిష్.! పదో తరగతి వరకూ విడపనకల్లు ఆదర్శ పాఠశాలలో, ఇంటర్ బళ్లారిలో పూర్తి చేశాడు. ఆ తరువాత సోదరులిద్దరూ మౌనిష్‌ను ఫిలిప్పైన్స్‌కు పంపించి ఎంబీబీఎస్‌లో చేర్పించారు. అతని చదువు కోసం మిగిలిన భూమిలో కొంత అమ్మేశారు. ఆ కుటుంబం పెట్టుకున్న ఆశలను మౌనిష్ వమ్ము కానివ్వలేదు. ఎంబీబీఎస్ పూర్తి చేసివచ్చి.. డాక్టర్‌గా ప్రభుత్వ వైద్యశాలలో విధుల్లో చేరాడు. ఇన్నాళ్లూ పడ్డ కష్టానికి ఫలితం దక్కడంతో ఆ కుటుంబంలో ఆనందం నిండింది. ఒక్క రోజు ముందే దీపావళి వెలుగులు వారి ముఖాల్లో కనిపించాయి.

\- విడపనకల్లు, ఆంధ్రజ్యోతి





కర్ణాటక రాష్ట్రంలోని కుడితినిలో డాక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న బండి మౌనిష్, తల్లిదండ్రులతో మౌనిష్

సైబర్ క్రైం పోలీసులమంటూ మోసం

రైల్వే ఉద్యోగిని బెదిరించి రూ.72 లక్షలు స్వాహా

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

గుత్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం పోలీసులమంటూ బెదిరింపులకు పాల్పడి ఓ రైల్వే ఉద్యోగి నుంచి రూ. 72లక్షలను స్వాహా చేసిన సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుత్తిఆర్ఎస్‌లోని చంద్రప్రియ నగర్‌లో నివాసమున్న రైల్వే ఉద్యోగి షేక్ మస్తాన్‌వలికి నాలుగు రోజుల క్రితం ముంబయ్ క్రైంబ్రాంచ్ పోలీసులమంటూ ఫోన్ కాల్ వచ్చింది. ఇటీవల బెంగళూరులో మీఆధార్ కార్డు ద్వారా సిమ్ కార్డు జనరేట్ అయ్యిందని, దీంతో న్యూడ్ వీడియోలు, ఫొటోలు, టెక్స్ట్‌మెసెజ్‌లు వస్తున్నాయని ప్రశ్నించారు. ముంబాయిలో ఓ మనీల్యాండరింగ్ కేసులో కూడా నీ హస్తం ఉందని భయపెట్టారు. తాను ముంబాయికి వెళ్లలేదని ఆయన చెప్పగా సైబర్ నేరగాళ్లు దబాయించారు. నీపై అనుమానం ఉందని, విచారణకు సహకరించాలని అన్నారు. మాకు సహకరిస్తే కేసు నుంచి భయపడేస్తామని, ఇందుకు తాము చెప్పిన బ్యాంక్ ఖాతాకు డబ్బులు చెల్లించాలని కోరారు. భయపడి పోయిన ఆయన వెంటనే పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఆర్టీజీఎస్ ద్వారా రూ.12లక్షలు పంపించారు. అలాగే మరో రూ. 20లక్షలు ఇండెక్స్ బ్యాంక్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలా మొత్తం మీద రూ.72లక్షలు వారికి బ్యాంకుల ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత రెండు రోజుల క్రితం తిరిగి సైబర్‌నేరగాళ్లు మరో రూ. 54లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయమన్నారు. ఇక తన వద్ద డబ్బులు లేకపోవడంతో విషయం తన ఇద్దరు కుమార్తెలకు చెప్పాడు. అనంతరం సైబర్‌నేరగాళ్లతో మోసపోయానని తెలుసుకొని, వెంటనే అనంతపురం క్రైం పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. తర్వాత మంగళవారం రాత్రి గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఘన సన్మానం



ఎమ్మెల్యే ఎంఎస్ రాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు రాయల్ మురళి, వెంకటప్ప తదితరులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజును పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం రాత్రి ఎంఎస్ రాజుకు పూల మాల వేసి, శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, నాయకులు వెంకటప్ప, శ్రీనివాసులు, ఆది, నరసింహులు, బాల రంగయ్య, గోపాల్, శివనాయు డు, కల్లూరు మల్లికార్జున, రాయల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులను చూపుతున్న ఎమ్మెల్యేలు, స్వామీజీ

అనంతపురం రూరల్/ అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు పావగడ శ్రీరామకృష్ణ సేవాశ్రమం ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ చేపట్టారు. గ్రా మంలోని ఇందిరమ్మ కాలనీ, అంబేడ్కర్ నగర్, వైఎస్సార్ కాలనీ పరిధిలోని ప్రజలకు బుధవారం శ్రీరామకృష్ణ సేవా శ్రమం జపానంద స్వామి, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, మండల అధికారులు, టీడీపీ నాయకులతో కలసి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులురెడ్డి, రాగేమురళి, గోవిందు, బాలరాజు, ఎంపీటీసీ, నరేష్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబునాయుడిని కలిసి సీఎం సహాయనిధికి రూ. 17.34 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్కేయూనివర్సిటీ ప్రొఫెసర్ జీ వెంకటనాయుడు, సిబ్బంది

నగరంలో ఐటీ దాడులు



దాడులు నిర్వహిస్తున్న ఐటీ అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుల్జార్‌పేటలో ఉన్న ఓ వ్యాపారి ఇంట్లో బుధవారం రాత్రి ఐటీ దాడులు జరిగాయి. గుండమ్మ బస్ సర్వీస్ పేరుతో గతంలో వారు బస్సులు నడిపారు. ప్రస్తుతం రవీంద్రనాథ్, గళ్ల శ్రీనివాసుల ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. వీరికి అనం తపురం, ఉరవకొండ ప్రాంతాల్లో భారీగా ఆస్తులున్నట్లు తెలిసింది. అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీ పరిధిలో 35 ఎకరాల భూములుండేవని సమాచారం. ఆ క్రమంలో కొంత భూమిని వైసీపీకి చెందిన ఓ మైనార్టీ నాయకుడికి అమ్మిన ట్లు తెలిసింది. వారి పూర్వపు ఆస్తుల నేపథ్యంలో బ్లాక్ మనీ భారీగా ఉన్నట్లు సమాచారం. లావాదేవీల విషయంలోనూ, పన్ను సరిగా చెల్లించకుండా ఎగవేత వేసిన క్రమంలో ఐటీ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఐటీ అధికారుల దాడుల్లో రూ.3కోట్లకు పైగా నగదు దొరికినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా తెల్లవారుజాము వరకు ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి.

నిలువు దోపిడీ

భారీగా బాణసంచా ధరలు

అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసులు దుకాణాలలోనే పేలి.. ఆకాశాన్ని తాకాయి. కొనుగోలుదారులకు చుక్కలు చూపించాయి. శివకాశి నుంచి తక్కువ ధరకు తెచ్చిన వ్యాపారులు.. భారీగా ధరలను పెంచి అమ్మారు. నగరంలోని 120 దుకాణాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. రూ.5 వేలు వెచ్చించినా ఒక కుటుంబం కాసేపు కూడా టపాసులు కాల్చలేని పరిస్థితి ఏర్పడింది. చిన్న గిఫ్ట్ బాక్స్‌ను రూ.1800కు అమ్మారు. వ్యాపారులు 50 శాతం మార్జిన్‌తో అమ్మకాలు సాగించారు. మండల కేంద్రాల్లో అనధికారిక దుకాణాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. బాక్సులపై ముద్రించిన ఎమ్మార్పీకే విక్రయించారు. విద్యుత్ నగర్ సర్కిల్‌లో అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తుండగా టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని బాణసంచా దుకాణాలు ఎస్పీ జగదీశ్ తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

'సొసైటీల ఏర్పాటు ద్వారా చేనేతలకు ఉపాధి'

యాడికి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సొసైటీల ఏర్పాటు ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చేయవచ్చునని ఎన్‌హెచ్‌డీసీ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయ రావు తెలిపారు. మండలకేంద్రంలోని సమావేశభవనంలో బుధవారం ఆయన చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చేనేత కార్మికులు గ్రూపులుగా ఏర్పడి చేనేత సహకార సొసైటీలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సొసైటీల ద్వారా బ్యాంక్ రుణాలను పొంది లబ్ధి పొందవచ్చునని చెప్పారు. సొసైటీలోని సభ్యులు చేనేత సంక్షేమ పథకాల లబ్ధికి అర్హులవుతారన్నారు. గతంలో ఏర్పాటుచేసిన సొసైటీలు నిర్వీర్యమయ్యాయని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే చేనేత సహకార సొసైటీలో 50మంది సభ్యులు ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఓ బసవరాజు, ఏడీఓ శ్రీనివాసులు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక 60అడుగుల రోడ్డులో నివాసముంటున్న విరూపాక్షి(32) గృహ నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం తీవ్ర మనస్థానికి గురైన అతను రాత్రి సమయంలో తన ఇంటిలోని బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు పొట్టేళ్ల మృతి

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగి మీద పడడంతో షాక్‌కు గురై ఐదు పొట్టేళ్లు మృతి చెందాయి. ఈ సంఘటన పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ సిమెంట్ గోడౌన్ వెనుక బుధవారం చోటు చేసుకుంది. తనకున్న ఐదు పొట్టేళ్లను సిమెంట్ గోడౌన్ వెనుక వైపునకు మేతకు తీసుకెళ్లానని, అవి మేత మేస్తుండగా.. పైన విద్యుత్ తీగలు గాలికి ఒక్కసారిగా తెగి వాటిపై పడాయని, దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయని గొర్రెల కాపరి ఎరుకుల గోవిందప్ప వాపోయారు. పొట్టేళ్ల విలువ దాదాపు రూ. లక్ష ఉంటాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని తెగిపడిన విద్యుత్ తీగలను సరి చేశారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 10 మేకపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో జోగన్న, సిద్ధప్ప అనే కాపరులు మేకలను మేపుతూ జీవనాన్ని సాగించేవారు. కాగా బుధవారం మధ్యాహ్నం సమయంలో షెడ్‌లో ఉన్న మేకల మందపై పలు కుక్కలు దాడి చేశాయి. ఇందులో అవి కరవడంతో 10 మేకపిల్లలు మృతి చెందినట్లు కాపరులు వాపోయారు. దీంతో దాదాపు రూ. 80 వేలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బంగారం కోసమే గంగమ్మ హత్య

అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రనేల కొట్టాలకు చెందిన గుజ్జల గంగమ్మను బంగారం కోసమే హత్య చేశారని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. ఈ కేసులో నిందితులు చుక్కలూరు జయప్రకాష్, ఆకుమల్లల హరినాథ్‌బాబును బుధవారం అరెస్టు చేశారు. యర్రనేల కొట్టాలకు చెందిన అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. నిందితులు ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. జయప్రకాష్ పెదనాన్న రామకృష్ణ ఇంట్లో గంగమ్మ ఒంటరిగా అద్దెకు ఉండేది. ఆమెను బెదిరించి, లేదా చంపేసి బంగారు నగలు కాజేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం జయప్రకాష్ గంగమ్మ గదిలోకి వెళ్లాడు. ఆమెను అరవనీకుండా నోరు, గొంతు నొక్కి.. ఆభరణాలను కాజేశారు. ఈ క్రమంలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. పోలీసు జాగిలాలు గుర్తించకుండా ఉండేందుకు గదిలో కారం పొడి చల్లారు. బంగారు గొలుసు, కమ్మలు, వెండి పట్టీలు, రూ.4 వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పారిపోయారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం నగరంలో డిగ్రీ విద్యార్థిని అశృత అదృశ్యమైంది. పామిడికి చెందిన అశృత నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లిన ఆమె రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో విద్యాసంస్థ నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని తండ్రి చిన్న నాగరాజు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.

వాహనమిత్ర డ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు



రామకృష్ణ

కుందుర్పి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెస్తరపల్లికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఆయన భార్య రాధిక మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. రామకృష్ణ గత నాలుగేళ్లుగా వాహనమిత్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలలుగా వేతనం అందకపోవడంతో గత మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జీతాలు చెల్లించాలని కోరాడు. అయితే రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదని, పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే రెండు నెలల జీతాలు చెల్లించాలంటే గ్రామంలోని రేషన్ డీలర్, వీఆర్వోతో పనిచేసినట్లు ధ్రువీకరణపత్రాన్ని తీసుకెళ్లాలని ఆదేశించారు. దీంతో సరేలే అంటూ.. అక్కడి నుంచి బయలుదేరిన ఇక అప్పటి నుంచి ఇంటికి రాలేదని, పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికోవెల గ్రామంలో బుధ వారం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేశ్(48), తమ్ముడు నారాయణస్వామి కలిసి ముష్టి కోవెలకు వెళ్లి బీగాల వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవ శాత్తు కాలు జారి చెరువులో ప డ్డాడు. అతడిని ఈత రాదు. చెరువు కట్టపై ఉన్న తమ్ముడు నారాయణస్వామి గట్టిగా అరవడంతో చుట్టు పక్కల ఉన్న వారు వచ్చి బయటకు తీయగా అప్పటికే మృతిచెందా డు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయ ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా ఈఈ ఉద్యోగ విరమణ సభ

అనంతపురం సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని పీఐయూ ఈఈ కేవీ కేవీ ప్రసాద్ పదవి విరమణ కార్యక్రమాన్ని స్థానిక ఆ శాఖ ఎస్ఈ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం హజరై మాట్లాడారు. విధి నిర్వహణలో ఈఈ ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఉద్యోగులు ఈఈ దంపతులకు పూలమాలలు వేసి, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఈఈలు మల్లికార్జునమూర్తి, ప్రభాకర్ రెడ్డి, మురళి, పలువురు డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.



ఈఈ ప్రసాద్ దంపతులను సత్కరించిన ఉద్యోగులు

నాణ్యతలో రాజీ పడం : పీడీ

శింగనమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని డ్వామా పీడీ సలీం భాష పెర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని నాయనవారిపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న సీసీరోడ్లు, సర్క్యులేషన్ ట్యాంకు పనులను తనిఖీ చేశారు.

పారిశుధ్య సమస్య లేకుండా చూస్తాం : ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరపాలిక పరిధిలో కొన్ని కొత్త వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. 15వ ఆర్థికసంఘం, ఎస్‌సీఏపీ నిధులతో రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు ట్రాక్టర్లు, ఒక వాటర్ ట్యాంకర్, ఒక నాలా మ్యాన్ వాహనాలను కొనుగోలు చేశారు. వాటిని బుధవారం మేయర్ మహమ్మద్ వసీం, నగర కమిషనర్ నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. డ్రైనేజీలు, వంకలు శుభ్రం చేసేందుకు, చెత్తా చెదారం తొలగించేందుకు కొత్త వాహనాలు ఉపయోగపడతాయన్నారు.



ధ్వని, వాయు కాలుష్యాన్ని నివారించాలి

ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ



దీపావళి పండుగ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న కళాకారులు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే దీపాల పండుగగా జరుపుకొని... ధ్వని, వాయు కాలుష్యాన్ని నివారించాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాని మెంటల్ ఇంజనీర్ బీవై మునిప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రాజేంద్రప్రసాద్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 'దీపావళి పండుగ ప్రాధాన్యత - టపాసులు, దీపాలు, జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మునిప్రసాద్ మాట్లాడుతూ దీపావళి పండుగ కుల, మతాలకు అతీతంగా జరుపుకునే ప్రతిష్టాత్మక, పవిత్రమైన సందర్భమని తెలిపారు. దీపావళి పండుగను టపాసుల మోతతో కాకుండా దీపాల వెలుగులో జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం ప్రాధాన్యతను తెలుసుకుని వాటిని రక్షించాలని వివరించారు. దీపావళి పండుగ ప్రాధాన్యతపై కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజినేయులు, ఏపీపీసీబీ ఏఈ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.







రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్. నారాయణచౌదరి

రామగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి పేర్కొన్నారు. మండలంలోని ఎంసీపల్లి పంచాయతీ ఏటిగడ్డ తిమ్మాపురంలో బుధవారం రైతు గొల్ల ముత్యాలప్పకు సబ్సిడీ కింద మంజూరైన డ్రిప్ పరికరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం 90శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ అందజేస్తోందన్నారు. అర్హులైన రైతులందరికి సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రిప్ డీలర్ రవికుమార్, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.









కర్ణాటక మద్యం స్వాధీనం

రామగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిగరచెట్టు క్రాస్ వద్ద దాడులు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీకేపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్ తెలిపారు. అందిన సమాచారం అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అలీలీగ్, సీకేపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్ అజం సిబ్బందితో కలిసి మండలంలోని చిగరచెట్టుక్రాస్ వద్ద తనిఖీలు చేశామ న్నారు. రామగిరికి చెందిన ఒకర్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 110 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామన్నారు.






నిబంధనలు పాటించాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ హరికుమార్ పేర్కొన్నారు. స్థానిక రామ్ నగర్ 80అడుగుల రోడ్డు అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని టపాసుల విక్రయ దుకాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో టపాసుల దుకాణాలను బుధవారం పరిశీలించారు.







సీఎం చంద్రబాబుతోనే మహిళల సంక్షేమం

● ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్‌ను దీపావళి పండుగ కానుకగా కూటమి ప్రభుత్వం ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అసత్య ప్రచారాలు మానుకోండి

ఎమ్మెల్యే అచూకీ ఎక్కడంటూ కొన్ని మీడియా సంస్థలు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ఇలాంటివి మానుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొద్ది రోజులుగా తీవ్ర జ్వరం, ఫ్లూ కారణంగా స్వల్ప అస్వస్థతకు గురై, వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుటున్నానని తెలిపారు. నియోజకవర్గం సమస్యలపై ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అధికారులకు ఫోన్‌లోనే అందుబాటులో ఉన్నానన్నారు. వీలైనంత త్వరగా కోలుకుని అందుబాటులోకి వస్తానని తెలిపారు.







క్రీడాకారులను అభినందిస్తున్న సిబ్బంది

ముగిసిన చెస్ పోటీలు

లేపాక్షి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 చెస్ పోటీలు బుధవారం స్థానిక నవోదయ పాఠశాలలో ముగిశాయి. రెండురోజులు నిర్వహించిన బాలబాలికల చెస్ పోటీల్లో 130 మంది పాల్గొన్నారు. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా మొదటిస్థానం, కృష్ణాజిల్లా రెండోస్థానం, పశ్చిమ గోదావరి మూడోస్థానం సాధించాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలిచింది. అనంతపురం రెండోస్థానం, పశ్చిమ గోదావరి మూడోస్థానంలో నిలిచినట్లు నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

రేపు మంత్రి సత్యకుమార్ రాక

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నవంబరు 1న ధర్మవరం రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ధర్మవరం మండలం రేగాటిపల్లి చెరువు వద్ద జలహారతి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం ధర్మవరం చెరువును సందర్శించి జలహారతి ఇస్తారని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ధర్మవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు స్థానిక జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 28న అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని వైష్ణవి, 8వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య ప్రతిభ చాటారు. వీరు నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో వచ్చేనెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న శ్రీనివాసులు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజేఖాన్‌పల్లి వాసి సురేష్ (40) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కదిరిలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడు. అతని భార్య భారతి రాట్నాపల్లి ప్రైవేటు పాఠశాలలతో ఉపాధ్యాయురాలు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. సురేష్ ప్రైవేటు ఫైనాన్స్‌లో అధికంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చాలంటూ వారు ఇంటి వద్దకు వచ్చి గొడవ చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను.. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు.

కె.పూలకుంటలో మహిళ...

నల్లచెరువు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.పూలకుంట గ్రామానికి చెందిన గంగాద్రి భార్య జిగ్గేరి శారదమ్మ (35) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుటుంబ కలహాలతో దంపతులు గొడవపడ్డారు. దీంతో శారదమ్మ మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బుధవారం గ్రామ సమీపంలోని బావిలో ఆమె మృతదేహం ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించి... పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మగ్బుల్‌బాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బత్తలపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మల్లకుంట క్రాస్ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన నయుం మరణించాడు. రిహన్ ఎంటర్ ప్రైజస్‌లో ట్రైనీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న అతను.. కదిరి వైపు నుంచి అనంతపురానికి కారులో బయలుదేరాడు. గుమ్మల్లకుంట క్రాస్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా.. రోడ్డు పని చేసే వారు అతన్ని వెంటనే ప్రత్యేక వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అపారమైన అవస్థలు

- అక్షరం తేడా ఉన్నా జనరేట్ కాని అపార్
- ఆధార్‌లో సవరణకు తల్లిదండ్రుల పరుగు
- పది శాతం కూడా పూర్తికాని పరిస్థితి
- 169 స్కూళ్లలో మొదలే కాని ప్రక్రియ
- 24వ స్థానంలో అనంతపురం జిల్లా
- కష్టంగా వన్ ఇండియా- వన్ అపార్ ఐడీ



అపార్ కార్డు నమూనా

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ
జిల్లాలో ఉన్న మొత్తం విద్యార్థులు 3,71,859
ఇప్పటి వరకూ జనరేట్ అయిన అపార్ ఐడీలు 86,332
పెండింగ్ ఉన్న విద్యార్థులు 2,85527
జిల్లాలోని మొత్తం స్కూళ్లు 2416
ప్రారంభించిన స్కూళ్లు 2247
ఇప్పటి వరకూ ప్రారంభించని స్కూళ్లు : 169
ఐడీలు జనరేట్ శాతం : 23.22
రాష్ట్రంలో జిల్లా స్థానం : 24వ స్థానం

అనంతపురం విద్య, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఒక నెంబరుతో కార్డు రానుంది. 12 అంకెలతో, విద్యార్థి సమగ్ర వివరాలతో జీవితకాలం (లైఫ్‌టైం) ఉండే కార్డును అందించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఈ ప్రత్యేక గుర్తింపు కార్డుకు అనేక ఆంక్షలు పెట్టారు. విద్యార్థి బర్త్ సర్టిఫికెట్ లేదా, ఆధార్ కార్డు లేదా యూ-డైస్‌లో ఎక్కడ చిన్న అక్షరం తేడా ఉన్నా కార్డు జనరేట్ కావడం లేదు. విద్యార్థి పేరు కానీ, సర్ నేమ్ కానీ, విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లు, ఇతర వివరాల్లో ఏది తప్పుగా ఉన్నా, కొంత తేడాగా ఉన్నా అడుగు ముందుకుపడదు. దీంతో అపార్ కార్డుల జనరేట్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. విద్యాశాఖ అధికారిక లెక్కల మేరకు జిల్లా వ్యాప్తంగా 3,71,859 మంది విద్యార్థులు ఉంటే ఇప్పటి వరకు 86,332 మంది విద్యార్థులకు మాత్రమే అపార్ ఐడీ జనరేట్ అయ్యింది. దీన్ని బట్టి అడ్డంకులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్‌లో మార్పునకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. వెరసి అపార్ కార్డును జనరేట్ చేయడంలో తీవ్ర జాప్యం అవుతోంది. దీంతో విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

12 అంకెల లైఫ్‌టైం కార్డు

దేశంలోని విద్యార్థులందరికీ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డు రూపొందించేందుకు కేంద్రం సిద్ధమైంది. 2020 విద్యావిధానంలో భాగంగా 12 అంకెల గుర్తింపు కార్డును తీసుకొస్తోంది. విద్యార్థుల అకడమిక్ పురోగతిని, అభ్యసన ప్రయాణాన్ని ట్రాక్ చేయడానికి దీనికి భవిష్యత్తులో వాడనున్నారు. ముఖ్యంగా డిజిటలైజేషన్, పర్సనల్ లెర్నింగ్, బడి బయట పిల్లలు లేదా చదువుకు దూరంగా ఉన్న పిల్లలను తిరిగి స్కూళ్లకు తీసుకురావడం వంటి ప్రక్రియలను సులభతం చేయడానికి, విద్యా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్న లక్ష్యంతో దీన్ని తెస్తున్నారు. అంతేకాకుండా డీజీ లాకర్ ద్వారా విద్యార్థులు తీసుకున్న కోర్సులు, గ్రేడ్లు, పొందిన సర్టిఫికెట్లు, స్కూల్‌టైంలో సాధించిన విజయాలు, ఇతర అకడమిక్ అంశాల చరిత్రకు శాశ్వత రికార్డును నిర్వహించడానికి ఈ ఐడీ ఎంతగానో దోహదపడుతుంది. విద్యార్థికి ఈ 12 అంకెల నెంబర్ ఉంటే ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా తమ అకడమిక్ రికార్డులను తీసుకునే(డౌన్‌లోడ్) వీలుంటుంది. అంతేకాకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర వివరాలకు చాలా భద్రత కూడా ఉంటుంది.

ఆంక్షలతో అవస్థలు..

అపార్ ఐడీ జనరేట్ చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు అందరికీ అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యంగా అపార్ ఐడీ క్రియేట్ చేయాలంటే విద్యార్థి ఆధార్ కార్డు, స్కూల్ రికార్డుల్లో, యూ-డైస్‌లో వివరాలు ఒకేలా ఉండాలి. చాలా మంది విద్యార్థుల వివరాలు ఒకేలా ఉండటం చాలా అరుదు. ఆధార్ కార్డులో పేర్లు ఒకేలా ఉంటే.. స్కూల్ రికార్డులో మరోలా లేదా యూ-డైస్‌లో ఇంకోలా ఉంటున్నాయి. విద్యార్థుల పుట్టిన తేదీలు, తల్లిదండ్రుల సర్ నేమ్స్ ఇలా అనేక తేడాలున్నాయి. సుమారు 70 మంది నుంచి 85 శాతం మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల డేటా ఒకేలా లేదని ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల ద్వారా తెలుస్తోంది. ఫలితంగా అపార్ ఐడీ కార్డుల జనరేట్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారిక గణాంకాల మేరకు ఈనెల 30 నాటికి జిల్లాలోని 31 మండలాల పరిధిలో ఒకటి నుంచి 10వ తరగతి వరకూ 3,71,859 మంది విద్యార్థులకు గాను కేవలం 86,332 మందికి మాత్రమే ఐడీలు జనరేట్ చేశారు. ఇంకా 2,85, 527 మంది విద్యార్థులకు జనరేట్ చేయాల్సి ఉంది. 23.22 శాతం మాత్రమే పూర్తి చేయగలిగారు. 2416 స్కూళ్లు ఉంటే 2247 స్కూళ్లలో ఈ ప్రక్రియ మొదలు కాగా నేటికీ 169 స్కూళ్లలో ఐడీల జనరేట్ ప్రక్రియ మొదలు కాలేదు. అత్యధికంగా అనంతపురం మండలంలో 179 స్కూళ్లలో, గుంతకల్లు మండలంలో 101 స్కూళ్లలో, తాడిపత్రిలో 99 స్కూళ్లలో ఈ ప్రక్రియ మొదలుకాలేదు.

ఆంక్షలకు తోడు అధికారుల నిర్లక్ష్యం

అపార్ ఐడీలు జనరేట్ చేయడంలో అనంతపురం జిల్లా అట్టడుగు స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 24వ స్థానంలో నిలిచింది. దీని వెనుక ఆంక్షలు సమస్యల కొంత అయితే అధికారులు నిర్లక్ష్యం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. గతంలో పనిచేసిన వెళ్లిన డీఈఓ ఏ రోజూ అపార్ ఐడీ ప్రక్రియ సమావేశం నిర్వహించకపోవడం, టెలీ కాన్ఫరెన్స్‌లు పెట్టకపోవడం, అధికారులను పర్యవేక్షణ చేయకపోవడం కూడా ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. మరో వైపు ఆధార్ కార్డు, స్కూల్ రికార్డులు, యూ-డైస్‌లో అనేక తప్పుల వల్ల కూడా తీవ్ర జాప్యం అవుతోంది. అయితే ఆధార్ కేంద్రాల్లో అనేక అవస్థలు కూడా ఎదురవుతున్నాయి. ప్రతి స్కూల్‌లో లేదా ప్రతి గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దీని వల్ల విద్యార్థుల ఆధార్ కార్డుల్లోని తప్పులు సరిచేయడం సులభం అవుతుంది. తద్వారా ప్రధాన సమస్యలు పరిష్కారమై త్వరగా అపార్ కార్డు చేయడానికి వీలవుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఆధార్ క్యాంపులు పెట్టాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్‌పై అవగాహన లేని తల్లిదండ్రుల పిల్లల పేర్లు, పుట్టిన తేదీ, ఇంటి పేర్లు తప్పులుగా నమోదయ్యాయి. వీటిని సరిచేయానికి ఆధార్ అప్‌డేట్ చేయించాలి. అయితే ఆధార్ కేంద్రాలు పరిమితంగా ఉండటం వల్ల ఈ ప్రక్రియ చాలా ఆలస్యమవుతోంది. తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లడం వల్ల పిల్లలు ఆధార్ వివరాలు సరిచేయడానికి చాలా అవస్థలు పడుతున్నారు. యూడైస్‌లో పొరపాట్లను ఎమ్మార్సీ సిబ్బంది సరిచేస్తున్నారు. కానీ ప్రధాన సమస్య ఆధార్ కార్డుల్లో మార్పులు త్వరగా జరగాలంటే పాఠశాల లేదా గ్రామ స్థాయిలో ఆధార్ క్యాంపులు పెట్టాలి.

- చంద్రమౌళి, హెచ్‌ఎం, బ్రహ్మసముద్రం జడ్పీహైస్కూల్, జూనియర్ కళాశాల

సచివాలయ సిబ్బందికి అప్పగించాలి



అపార్ ఐడీ కార్డుల జనరేట్ ప్రక్రియ ఎంతో ప్రయాసలతో కూడుకున్నది. ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో చాలా చోట్ల సబ్జెక్టు టీచర్ల కొరతఉంది. పాఠశాలల్లో బోధనకు అనేక ఇబ్బందికర పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బోధనా సిబ్బంది అయిన టీచర్లకు ఈ అపార్ ఐడీల జనరేట్ ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వాలి. సాంకేతిక అనుభవం ఉన్న సచివాలయ సిబ్బందికి ఈ కార్యక్రమాన్ని అప్పగించాలి. హెచ్‌ఎం ద్వారానే ఈ ప్రక్రియను పూర్తి చేయాలనుకుంటే... పిల్లల ఇంటి పేరు నమోదు చేయడంలో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు ఎడిట్ ఆప్షన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలి.

- గౌనిపాతిరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పురంలో కత్తులతో దాడి

- ముగ్గురికి గాయాలు





గాయపడిన వారు

హిందూపురం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి విషయం కత్తులతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. పట్టణంలోని శాంతి టాకీస్ సమీపంలో నివాసముండే బేకరీ ఇలియాజ్ ఆయన కుమారుడు హాసన్, ఇలియాజ్ సమీపబంధువు అక్బర్‌పై అదే ప్రాంతానికి చెందిన వారు కత్తులతో దాడి చేశారు. బుధవారం రాత్రి ఇంటి సమీపంలో ఆటోలో కూర్చున్న అలీమ్, సల్మాన్ మధ్య ఏదో విషయంపై మాటామాటా పెరిగింది. ఈ సందర్భంగా నచ్చజెప్పేందుకు ఇలియాజ్ ప్రయత్నించాడు. కానీ కొద్ది సేపటికే సల్మాన్ అతడి అన్న ఇనాయతుల్లా కత్తులు తీసుకెళ్ళి బేకరి ఇలియాజ్‌తో పాటు వారికి అడ్డువచ్చిన హసన్, అక్బర్‌లపై దాడికిదిగారు. దీంతో వారికి తీవ్ర గాయాలైనాయి. వీరిని బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. వీరిపై బాధితుడు ఇలియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. పోలీసులు శాంతి టాకీస్ సమీపంలో గట్టి నిఘావేశారు. దీనిపై సన్నిహితులు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం అడిగినందుకు ఇవ్వలేదని దీంతో గొడవపడి పొడుచుకునే వరకూ వెళ్లారని చెబుతున్నారు.

ప్రభుత్వంతో సమానంగా పేదలకు

ఆర్డీటీ సేవలు: పరిటాల శ్రీరామ్

ఆత్మకూరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలకు ప్రభుత్వంతో సమానంగా ఆర్‌డీటీ మంచి సేవలు అందిస్తోందని టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండ ల పరిధిలోని పంపనూరులో బుదవారం ఆర్‌డీటీ ఆధ్వర్యంలో రూ. 21లక్షలతో నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్‌డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచక్ష ఫెర్రర్‌తో కలసి పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కరువు జిల్లాకు ఆర్‌డీటీ చేస్తున్న సేవలు ఎనలేనివని కొనిడారు. మరిన్ని కార్యక్రమాలకు తమవంతు సాయం అందిస్తామన్నారు. మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ... జిల్లాలో 21 మోడల్ అంగనవాడీ భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అవసరమైతే వీటిలో మరింత మెరుగైన మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, డీఎల్‌పీఓ లలితా, ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, గ్రామ సర్పంచ్ ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, పరిటాల శ్రీరామ్, మాంచో

పోలీసు అమరవీరుల

త్యాగాలే స్ఫూర్తి: ఎస్పీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ రత్న, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుందామని ఎస్పీ రత్న.. పోలీసులకు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరులకు నివాళిగా జిల్లాకేంద్రంలోని హనుమాన్ కూడలి నుంచి బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ.. అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వారు చూపిన మార్గంలో నడవాలన్నారు. అనంతరం హనుమాన్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చి వరకు పోలీసులు, పట్టణ ప్రముఖులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. అమరవీరుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు ఉంచి, ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సత్యసాయి జయంత్యుత్సవాలు: కలెక్టర్

పుట్టపర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సత్యసాయి జయంత్యుత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ- నవంబరు 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే సత్యసాయి జయంతి వేడుకలకు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నవంబరు 15వ తేదీలోగా తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్, ఇంటర్నల్ రోడ్లు, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్లు, ఉచిత వైద్యశిబిరాలు, వీధిలైట్లు తదితర పనులు పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల నోడల్ ఆఫీసర్‌గా పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ వ్యవహరిస్తారన్నారు. పార్కింగ్ స్థలాలు, ప్రయాణ సౌకర్యాలు, కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, డీఆర్వో విజయసారధి, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు వాసుదేవన్, కోటేశ్వరరావు, చలం, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచింగ్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

కొత్తచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో టీచింగ్ పోస్టులకు మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు డీఈఓ కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయం బ్లాగ్‌స్పాట్‌లో ఉంచామన్నారు. అభ్యంతరాలుంటే నవంబరు 1వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఆధారాలతో అందజేయాలని డీఈఓ సూచించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిండుకుండ



నీటితో కళకళలాడుతున్న గొల్లపల్లి రిజర్వాయర్

పెనుకొండ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నిండుకుండలా మారింది. రిజర్వాయర్‌కు 1.47 టీఎంసీల నీరు చేరిందని జేఈ రాజశేఖర్ తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 1.913 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.47 టీఎంసీల నీరు చేరిందన్నారు. దీంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. సందర్శకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు.

ఇసుక వాహనాల సీజ్

బత్తలపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరశనపల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసినట్లు సీఐ ప్రభాకర్ బుధవారం తెలిపాడు. చిత్ర వతి నది నుంచి ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వాటిని సీజ్ చేశామన్నారు. ఆయన వెంట ఎస్ సోమశేఖర్, సిబంది ఉన్నారు.

యథేచ్ఛగా..!



- జిల్లామీదుగా వక్కల అక్రమ రవాణా
- ముడుపుల మత్తులో కొందరు అధికారులు
- స్థాయిని బట్టి లంచాల చెల్లింపు
- ప్రతినెలా పన్నుల శాఖకు రూ.10కోట్లుపైనే టోకరా

జిల్లా మీదుగా వక్కలను అక్రమంగా రవాణా చేస్తూ కొందరు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో పండిన వక్కలను ఎటువంటి పన్ను చెల్లించకుండానే తెలంగాణ ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాలో అధికారులను ముడుపులతో జోకొడుతున్నారు. ఇద్దరు బడా వ్యాపారులు నిత్యం ఈ వ్యవహారం సాగిస్తూ యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. ఏడాదిన్నర కిందట గార్లదిన్నె మండలం కల్లూరులో రెండు లారీలు పట్టుకున్నారు. ఆ సమయంలోనూ తక్కువ జరిమానా విధించారనే ఆరోపణలున్నాయి. ఓ స్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి నెలా ముడుపులు పుచ్చుకోవడంతో వక్కల అక్రమ రవాణాకు అడ్డుచెప్పేవారే లేకుండా పోయారు.

- అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి

ఢిల్లీ పేరుతో నకిలీ బిల్లు.. హైదరాబాద్‌కు రవాణా

వక్కల రవాణా అక్రమార్కులకు మంచి లాభమే తెచ్చిపెడుతోంది. తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అయితే జీఎస్టీని చెల్లించకుండా ఎగ్గొడుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ తదితర ప్రాంతాల్లో వక్కలు అధికంగా పండిస్తారు. ఆ వక్కలను తెలంగాణకు ఎక్కువగా తరలిస్తారు. రకాలను బట్టి కిలో వక్కలు రూ.250ల నుంచి రూ.450 వరకు పలుకుతాయి. ఒక్కో లారీలో 15టన్నుల నుంచి 18టన్నుల వక్కలను తరలిస్తారు. వక్కలకు 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.లక్షకు రూ.18వేలు చెల్లించక తప్పదు. అవేమీ లేకుండానే వ్యాపారం చేసేస్తున్నారు. ఢిల్లీకి తరలిస్తున్నట్లు బిల్లులో చూపిస్తారు. కానీ తరలించేది హైదరాబాద్ తదితర ప్రాంతాలకే. వేబిల్లు లేకుండానే జీరో వ్యాపారం చేస్తున్నారు.

అధికారులకు భారీగా ముడుపులు

కర్ణాటక నుంచి వక్కలు తరలించే బడా వ్యాపారుల ఆదాయం అంతా ఇంతా కాదు. 2022లో వక్కలు పట్టుకున్న అధికారి శ్రీనివాసులునాయుడుతో బేరం బెడిసికొట్టింది. జిల్లాలో అనంతపురంలో రెండు సర్కిళ్లు, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి సర్కిళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం సర్కిళ్లున్నాయి. జిల్లాలో కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం నగర శివారుకు చేరుకుని... అనంతపురం-బెంగుళూరు హైవే మీదుగా ఈ లారీలు వెళ్తుంటాయి. మరో రూట్‌లో పెనుకొండ మీదుగా వస్తుంటాయి. పన్నుల శాఖలో ఒక్కో సారి ఒక్కో సందర్భంలో తనిఖీ చేసే పరిస్థితి ఉంటుంది. దీంతో అధికారులందరికీ నెల నెలా ముడుపులు ఇచ్చేలా బడా వ్యాపారులు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఆ మేరకు ఓ ఉన్నతాధికారికి రూ.4లక్షలు చొప్పున అందుతుందని సమాచారం. రెండు ఫర్మ్‌ల తరపున రూ.8లక్షలని తెలిసింది. ఇక సర్కిళ్ల వారిగా ఓ అధికారికి రూ.లక్ష, ఆ కిందిస్థాయి అధికారికి రూ.50వేలుగా పంపకాలు సాగిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఏ సర్కిల్ పరిధిలో అడుగుపెడతారో సంబంధిత సర్కిల్ కీలకంగా ఉంటున్న ఓ అధికారి నుంచే నెలనెలా ఈ పంపకాలు జరుగుతా యట. జిల్లా పరిధిలో ప్రతి నెలా రూ.15లక్షల వరకు పంపకాలు చేస్తున్నారంటే వారి ఆదాయం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అంతా పెద్దోళ్లే పంచుకుంటారు కానీ...కింది స్థాయిలో ఒక్క రూపాయి విదిల్చడం లేదంటూ పన్నుల శాఖలో కొందరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

మంత్రి జిల్లాలోనే..

వక్కల లారీలు వారంలో కనీసం మూడురోజులైనా వెళ్తుంటాయని సమాచారం. ఒక్కో వ్యాపారి ఏడెనిమిది లారీల చొప్పున వక్కలు రవాణా చేస్తుంటారని సమాచారం. జిల్లా మీదుగా ఎక్కువగా రాత్రి సమయాల్లోనే రవాణా చేస్తుంటారు. 2022లో ఆరు వక్క లారీలు పట్టుబడినప్పుడు రూ.1.5కోట్లు జరిమానా విధించారు. అంటే అందులో కనీసం రూ.50లక్షలైనా జీఎస్టీ, జరిమానా విధిస్తే రెండు ఫర్మ్‌లకు రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా తరచూ పట్టుకుంటే ప్రతి నెలా కనీసం రూ.10కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు పన్నుల శాఖకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ, పన్నుల శాఖ మంత్రి ఇలాఖాలోనే ఇలా జరుగుతోంది. వైసీపీ హయాంలో మామూళ్లకు అలవాటుపడిన పన్నుల శాఖ అధికారులు కొందరు ఈ ప్రభుత్వంలోనూ తమ పనికానిస్తున్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీఐలు

ఉరవకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ మైదానంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 45మంది పోలీసులు, యువకులు పాల్గొనం రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్, రూరల్ సీఐలు సురేష్, చిన్నగౌస్, వైద్యుడు ఎల్లోజీ, లయన్స్‌క్లబ్ సభ్యులు సప్తగిరి, మల్లికార్జున, ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యుడు మురళి పాల్గొన్నారు.









ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా నిర్వహించారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం ఉన్న వారికి పార్టీ రూ.5లక్షల ప్రమాదబీమాతోపాటు ఆ కుటుంబానికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కనుక ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందాలని సూచించారు. అనంతరం పలువురి చేత సభ్యత్వ నమోదు చేయించారు. అలాగే పట్టణంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. కార్యక్రమంలో నాయకులు కేశవనాయక్, మాజీ జడ్పీటీసీ తులసీదాస్ నాయక్, సర్పంచ్ సుదీప్, మాజీ ఎంపీటీసీ నాగన్న, స్థానిక నాయకులు సుబ్రహ్మణ్యానాయక్, వాల్యానాయక్, బూత్ కన్వీనర్లు గోపాల్ నాయక్, మున్నానాయక్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అజెండాను చదివి వినిపించారు. చేపట్టాల్సిన పనులకు, ఖర్చు చేయాల్సిన నిధులకు ఆమోదం తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పుట్లూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సూపర్‌మార్కెట్ పక్కన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 27మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న వెంకటరంగయ్యను అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి మద్యంను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

అక్రమ కట్టడాలను కూల్చేస్తాం

తాడిపత్రి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ నాయకులు కట్టిన అక్రమ కట్టడాలను న్యాయబద్ధంగా కూల్చివేస్తామని కౌన్సిలర్ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డం పెట్టుకొని కొందరు అనేక అక్రమ కట్టడాలు చేపట్టారని, అందులో భాగంగా వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, అంబటి రాఘవరెడ్డి, ఆకుల చిన్ననాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి వీరందరూ అక్రమంగా కట్టడాలు నిర్మించారని తెలిపారు. వీరికి 15రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోగా ఆధారాలు ఉన్నట్లయితే తేవాలని సూచించారు. అనంతరం 15రోజుల తర్వాత న్యాయబద్ధంగా అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని తెలిపారు.

ఘనంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

కూడేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే వేదపండితులు ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

తహసీల్దార్లకు సీపీఎం నాయకుల వినతి

గుంతకల్లుటౌన్/ కూడేరు/ రాయదుర్గం రూరల్/ కళ్యాణదుర్గం రూరల్/ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలను కరువుప్రాంతాలుగా ప్రకటించాలని కోరుతూ గుంతకల్లు పట్టణంలో సీపీఎం నాయకులు బుధవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంతకుమునుపు జిల్లాలో 31మండలాలకు గాను 7మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని, మిగిలిన 24 మండలాలను ఎందుకు ప్రకటించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మిగిలిన మండలాలను కరువుకింద ప్రకటించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకేనాగరాజు, రామునాయక్, ఓబులేసు, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండల కేంద్రంలో సీపీఎం నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, నారాయణరెడ్డి జిల్లాలోని అన్ని మండలాలను కరువు కింద ప్రకటించాలని డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రాయదుర్గం పట్టణంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు తదితరులు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కళ్యాణదుర్గం పట్టణంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుతప్రసాద్.. తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని, గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ నిర్మాణంతో పాటు పైప్‌లైన్ ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. 2వ వార్డులో పైప్‌లైన్ ఏర్పాటుకు, పాతగుంతకల్లులోని నాగసముద్రం బావి వీధిలో డ్రైనేజీ నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, వాల్మీకి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప, నాయకులు పత్తి హిమబిందు, రంగన్న, రాము, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, యూసఫ్, బీ మహేశ్, రామాంజనేయులు, మహేశ్వర్, గుర్రం నారాయణ, కౌన్సిలర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు


హోమం చేయిస్తున్న దృశ్యం

పుట్లూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జ్వరంతో బాధపడుతుండడంతో.. త్వరగా కోలుకోవాలని కడవకల్లుకు చెందిన టీడీపీ నాయకుడు గోవర్ధన్‌రాజు తమిళనాడులోని తిరుత్తణి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని ప్రజల్లో ఉండాలని ఆకాక్షించారు. పూజల అనంతరం ఆలయం వద్ద హోమం చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పేకాటకేంద్రంపై బుధవారం దాడులు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.17200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.









నియోజకవర్గ ప్రజలకు
దీపావళి శుభాకాంక్షలు



కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అడుగులు వేస్తూ...కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో అహర్నిషలు కృషి చేస్తూ...నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ...అక్కడికక్కడే ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ...ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి "కార్యకర్తల కోసం..పేద ప్రజల అభ్యున్నతికి " శ్రమించే నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతూ...సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిచిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు...

- 114 చెరువులకు కృష్ణజలాలతో నీటితో నింపడమే తన ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతూ...కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించేందుకు రాత్రింబవళ్లు అహర్నిషలు శ్రమిస్తూ....ఎంతో తపనతో కృషి చేస్తున్నారు.

- సేవా కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందించడంతో లండన్ యూనివర్శిటీలో " మహాత్మాగాంధీ లీడర్ షిప్ అవార్డు " అందుకుని ఆదర్శంగా నిలిచిన అమిలినేని సురేంద్రబాబు

- కళ్యాణదుర్గం ప్రీమియర్ లీగల్ పోటీలు (కేపీఎల్) పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువకుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలు వెలికితీస్తూ...కనివినీ ఎరుగని రీతిలో క్రీకెట్ అభిమానుల్లోను, యువకుల్లోను ఫుల్ జోష్ నింపారు.

- ఉచిత డీఎస్సీ శిక్షణతో పాటు భోజన వసతులు కల్పించి..ఎంతోమంది నిరుద్యోగులను ఆదుకున్న ఘనత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకే దక్కింది.

- ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి ఎంతోమంది నిరుద్యోగులను ఆదుకున్నారు

- ఉచిత వైద్య సదుపాయాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం, దేవాలయాలకు లక్షలాది రూపాయలు ఆర్థిక సాయం అందించి దేవాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు

- నిరుపేదలకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేసి...చేయూతను అందించారు

- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చెత్తతో సంపదను సృష్టించి...అపరిశుభ్రతను తొలగించి...మంచినీటి సమస్యను పరిష్కరిస్తూ...అధ్వాన్నంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేస్తూ...మున్సిపాలిటీలో ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తూ...ఆదర్శ మున్సిపాలిటీగా తయారు చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు

- మద్యం దుకాణాల్లో తన స్వంత డబ్బును రూ.1.75 కోటి ఖర్చు చేసి, టెండర్లు వేసి ఆ మద్యం షాపులను కష్టపడ్డ కార్యకర్తలకే అందించి, రాష్ట్రంలోనే ఏ ఎమ్మెల్యే చేయలేని ఆలోచనలతో...కార్యకర్తలను ఆదుకున్నారు.

- పక్కాగృహాల నిర్మాణానికి ఆర్థిక సాయం పంపిణీ
- ఈ మూడు నెలల కాలంలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తూ...భవిష్యత్తులో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలతో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

మీ..
అమిలినేని సురేంద్ర బాబు
ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం నియోజకవర్గం



గొల్ల వెంకటేశులు
టీడీపీ అధ్యక్షులు, కళ్యాణదుర్గం



శర్మాస్ వలి
టీడీపీ పట్టణ అధ్యక్షులు, కళ్యాణదుర్గం



పాలబండ్ల శ్రీరాములు
టీడీపీ అధ్యక్షులు, బ్రహ్మసముద్రం



జి.ధనుంజయ
టీడీపీ అధ్యక్షులు, కుందుర్పి



కె.శివన్న
టీడీపీ అధ్యక్షులు, కంబదూరు



టి.ఆర్. తిప్పేస్వామి
టీడీపీ అధ్యక్షులు, శెట్టూరు